సాక్షి పెద్దపల్లి

మంగళవారం : 3 : జనవరి : 2023



మంత్రిని కలిసిన ఆర్జీ-1 జీఎం

గోదావరిఖని: కొత్త సంవత్సరం సందర్భంగా మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను ఆర్జీ-1 జీఎం కె.నారాయణ సోమవారం కలిశారు. మొక్క అందించి శాలువాతో సన్మానించారు.



పత్తి క్వింటాల్‌కు రూ.8,001

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్‌లో పత్తికి క్వింటాల్‌కు గరిష్టంగా రూ. 8,001 పలికింది. కనిష్టంగా రూ.7,462, సరాసరి రూ.7,911గా నమోదైందని మార్కెట్ కమిటీ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి దేవరాజ్ పృథ్వీరాజ్ తెలిపారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం

31.0 /18.0

వాతావరణం పొడిగా ఉంటుంది. పగటిపూట ఎండగా ఉంటుంది. ఉక్కపోత పెరిగే అవకాశముంది. సాయంత్రం చలిగాలులు కొనసాగుతాయి.

న్యూస్‌రీల్

సేవాధికార సంస్థలతో సత్వర న్యాయం

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి నాగరాజు



ప్రారంభిస్తున్న జిల్లా జడ్జి నాగరాజు

పెద్దపల్లిరూరల్: న్యాయ సేవాధికార సంస్థతో ప్రజలకు సత్వర న్యాయం అందుతుందని, అవసరమున్న వారంతా సేవలను వినియోగించుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి నాగరాజు అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సేవలను సోమవారం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఉజ్జల్ భూయాన్ వర్చువల్ పద్ధతిన ప్రారంభించారు. ప్రజలు సేవాధికార సంస్థ అందించే సేవలను పొందాలన్నారు. న్యాయసేవాధికారసంస్థ కార్యదర్శి అర్జున్, జూనియర్ సివిల్‌జడ్జి రాణి, ప్రియాంక, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సురేశ్‌బాబు, గోదావరిఖని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శైలజ, సుల్తానాబాద్ అధ్యక్షుడు పడాల శ్రీరాములు, పలువురు న్యాయవాదులున్నారు.

చదరంగాన్ని ప్రోత్సహించాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఎలిగేడు: చదరంగం పోటీలను గ్రామీణ స్థాయినుంచి ప్రోత్సహించాలని సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు మాడ కొండాల్‌రెడ్డి అన్నారు. ఈనెల 8న కరీంనగర్‌లోని వైశ్యభవన్‌లో జగన్ చెస్ అకాడమీ వైశ్యసేవా కేంద్రంలో జరిగే రాష్ట్రస్థాయి చదరంగ పోటీల కరపత్రాలను మండలంలోని నారాయణపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో ఆవిష్కరించారు. చదరంగంతో మేధాశక్తి, ఏకాగ్రత పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ సబ్బు శ్రీధర్, మాజీ ఉపసర్పంచ్ గుడుగుల మహేందర్, ఆర్గనైజర్ తాటిపల్లి సతీశ్‌బాబు, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చురుకుగా వంతెన పనులు



నీటిపై ప్రయాణిస్తూ భూగర్భంలో మట్టి పరీక్షలు చేస్తున్న బృందం

రామగుండం: గోలివాడ వద్ద గోదావరి నదిపై నిర్మించే వంతెన పనుల కోసం మట్టి పరీక్షలు చురుకుగా సాగుతున్నాయి. పది రోజులుగా గోదావరి నీటిలోంచి మట్టిని వెలికితీసి పరీక్షలకు తరలిస్తున్నారు. రూ.164 కోట్లతో నిర్మించనున్న ఈ వంతెనను మార్చిలోపు పూర్తి చేయనున్నట్లు తెల్సింది.

'ధ్రువ'తో కూలీల పిల్లలకు కార్పొరేట్ విద్య

- గోదావరిఖని ఏసీపీ గిరిప్రసాద్



పాఠశాలలోని టీవీని ప్రారంభిస్తున్న ఏసీపీ

రామగిరి(మంథని): ధ్రువ పాఠశాలల ద్వారా ఇటుకబట్టీల్లో పని చేసే వలస (ఒడిశా) కూలీల పిల్లలకు కార్పొరేట్ విద్య అందించడమే లక్ష్యంగా పోలీస్ శాఖ చర్యలు తీసుకుంటున్నట్లు గోదావరిఖని ఏసీపీ గిరి ప్రసాద్ తెలిపారు. మండలంలోని బేగంపేట సమీపంలోని ఎండీఎస్ ఇటుక బట్టి వద్ద ఏర్పాటు చేసిన ధ్రువ పాఠశాలను సోమవారం ప్రారంభించారు. కూలీల పిల్లలకు విద్యాభ్యాసం అందించాలనే లక్ష్యంతో ముందుగా పెద్దపల్లి డీసీపీ రూపేశ్ ఇటుక బట్టీల యజమానులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి, ఆపరేషన్ ధ్రువ ప్రాజెక్ట్‌పై వివరించారని పేర్కొన్నారు. పిల్లలకు బంగారు భవిష్యత్తుకు కార్పొరేట్ స్థాయి విద్య అందించాలని పాఠశాలలు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. డిజిటల్ తరగతుల కోసం స్మార్ట్ టీవీలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మంథని సీఐ సతీష్, రామగిరి ఎస్సైలు రవిప్రసాద్, పురుషోత్తం, దివ్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయాల్లో 'ముక్కోటి' పూజలు



శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు



బారులు తీరిన భక్తులు



దర్శనమిస్తున్న స్వామివారు



పూజలు చేస్తున్న భక్తులు



పూజలు చేస్తున్న భక్తులు




మహిళల మొక్కులు

ముక్కోటి ఏకాదశి సందర్భంగా జిల్లాలోని ఆలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. జిల్లాకేంద్రంలోని శ్రీవేంకటేశ్వర ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఉత్తర ద్వారం ద్వారా స్వామి వారిని దర్శించుకున్నారు. మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

జిల్లా ఓటర్లు 6,64,926

- పురుష ఓటర్లు 1061 మంది అధికం
- ఈనెల 5న తుది జాబితా ప్రకటన
- కొత్తగా నమోదైన ఓటర్లు 11,078 మంది



నియోజకవర్గాల వారీగా ఓటర్ల వయస్సు, వివరాలు

వయస్సు	పెద్దపల్లి	రామగుండం	మంథని
18-19	3158	1407	2896
20-29	43160	35648	41491
30-39	65207	62296	62296
40-49	49280	43649	43283
50-59	34796	33533	33585
60-69	24663	19448	21288
70-79	14656	7196	11235
80పైబడి	5122	1624	4009
మొత్తం	2,40,042	2,04,801	2,20,083

పెద్దపల్లిరూరల్: జిల్లా ఓటర్ల సంఖ్య 6,64,926 మందిగా తేలింది. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు తమ పేరును ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలంటూ అధికార గణం విస్తృతంగా ప్రచారం నిర్వహించడంతో నెల రోజుల వ్యవధిలో 11,078 మంది కొత్తగా ఓటర్లు నమోదయ్యారు. జిల్లా ఓటర్ల తుది జాబితాను ఈనెల 5న ప్రకటించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

పెద్దపల్లిలోనే ఎక్కువ..

జిల్లాలో పెద్దపల్లి, రామగుండం, మంథని అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. వీటిలో పెద్దపల్లి నియోజకవర్గం పరిధిలోనే ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. ఇక్కడ మొత్తంగా 2,40,042 మంది ఓటర్లున్నారు. వీరిలో మహిళా ఓటర్లు 1,20,120, పురుషులు 1,19,915 మంది. ఇతరులు ఏడుగురు ఉన్నారు. మంథనిలో మొత్తం 2,20,083 మంది ఓటర్లలో 1,10,840 మంది మహిళలు, 1,09,238 మంది పురుషులు నమోదయ్యారు. ఇతరులు ఐదుగురున్నారు. రామగుండంలో 1,03,822 మంది పురుష ఓటర్లు, 1,00,954మంది మహిళా ఓటర్లున్నారు. ఇతరులు 25మంది ఓటర్లుగా నమోదు చేసుకున్నారు.

కొత్తగా 11078 మంది నమోదు

జిల్లాలో కొత్తగా 11,078 మంది ఓటర్లుగా తమ పేర్లను నమోదు చేసుకున్నారు. గతేడాది నవంబర్ 9న ప్రకటించిన జాబితా ప్రకారం 6,53,848 మంది ఓటర్లున్నారు. జనవరి 5న ప్రకటించే జాబితా ప్రకారం జిల్లా ఓటర్ల సంఖ్య 6,64,926కు పెరిగింది. పెద్దపల్లి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోనే ఎక్కువగా 6,301 మంది ఓటర్లు నమోదయ్యారు. మంథనిలో 2,932 మంది, రామగుండంలో 1,845 మంది ఓటర్లుగా పేర్లు నమోదు చేసుకున్నట్లు అధికారుల గణాంకాలను బట్టి తెలుస్తోంది.

రూ.6కోట్లు తాగేశారు..



సుల్తానాబాద్: కొత్త సంవత్సరంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా జిల్లాలో మద్యం అమ్మకాలు జోరందుకున్నాయి. డిసెంబర్ 31న 2022ను సాగనంపుతూ.. 2023ను స్వాగతిస్తూ చిన్నారులు మొదలు.. వృద్ధుల వరకు ఎంజాయ్ చేశారు. మద్యం, మటన్, చికెన్‌తోపాటు కేకల అమ్మకాలు జోరుగా సాగాయి. కొన్ని షాపుల నిర్వాహకులు కేక్ కొన్నవారికి ఉచితంగా కూల్ డ్రింక్ అందించారు.

ప్రభావం చూపని శనివారం

డిసెంబర్ 31న శనివారం కావడంతో ఆ ప్రభావం మద్యం అమ్మకాలపై చూపలేదని ఎక్సైజ్ అమ్మకాలను బట్టి తెలుస్తోంది. తర్వాతి రోజు ఆదివారం కావడంతో ఆ రోజు కూడా మద్యం అమ్మకాలు సాగాయి. సెలవు దినం కావడంతో ప్రభుత్వ, ప్రవేట్ ఉద్యోగులు కుటుంబ సభ్యులతో ఎంజాయ్ చేశారు

మద్యం అమ్మకాల జోరు

జిల్లావ్యాప్తంగా 77 మద్యం షాపులు, 16 బార్లు ఉన్నాయి. ఇందులో రెండురోజుల్లో రూ.6 కోట్ల మద్యం అమ్మకాలు జరిగినట్లు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ మహిపాల్ రెడ్డి తెలిపారు. చికెన్, మటన్, కేకల వ్యాపారం రూ.3కోట్లు జరిగినట్లు వ్యాపారవర్గాల ద్వారా సమాచారం.

మేడమ్...హ్యాపీ న్యూఇయర్



కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఉద్యోగులు

పెద్దపల్లిరూరల్: 'మేడమ్.. హ్యాపీ న్యూ ఇయర్..' అంటూ సోమవారం ఉద్యోగులు కలెక్టర్ సంగీతను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో అడిషనల్ కలెక్టర్లు లక్ష్మీనారాయణ, కుమార్‌దీపక్, డీఏవో ఆదిరెడ్డి, డీఆర్‌డీవో శ్రీధర్, సాయినాథ్, డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్, జిల్లా టీఎన్‌జీఓల సంఘం అధ్యక్షుడు బొంకూరి శంకర్, ప్రధాన కార్యదర్శి రాజనరేందర్‌గౌడ్ తదితరులున్నారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ చేపట్టండి

- కలెక్టర్‌కు కాంగ్రెస్ కౌన్సిలర్లు, నాయకుల వినతి
- ఇష్టానుసారంగా నిధులు కేటాయిస్తున్నారని ఆరోపణ



కలెక్టరేట్‌లో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

పెద్దపల్లిరూరల్: మినీ ట్యాంక్‌బండ్ పనులకు ఎస్‌డీఎఫ్ నుంచి రూ.80.36 లక్షలు కేటాయించారని, తీర్మానాన్ని రద్దు చేసి ప్రజాధనం దుర్వినియోగం కాకుండా చూడాలని కలెక్టర్ సంగీతకు కాంగ్రెస్ కౌన్సిలర్లు వినతిపత్రం అందించారు. కౌన్సిలర్లు బూతగడ్డ సంపత్, తూముల సుభాష్‌రావు, శ్రీమాన్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే ఒత్తిడి మేరకే రూ.80 లక్షల తీర్మానాన్ని ఆమోదించుకున్నారని, మినీ ట్యాంక్‌బండ్ పనులు అధికారపార్టీ నాయకులకు ఆదాయవనరుగా మారిందన్నారు. ఇదే ట్యాంకుబండ్‌పై దినసరి కూలీల పేరిట రూ.34 లక్షలు, నీరు పోయడానికంటూ ఐదు ట్యాంకర్లకు రూ.13లక్షలు కేటాయించడం సరికాదన్నారు. ఇప్పటివరకు ఎల్లమ్మ, గుండమ్మ చెరువుకట్ట మినీ ట్యాంక్‌బండ్ పనులకు మున్సిపల్ నుంచి వివిధ గ్రాంట్ల ద్వారా వచ్చిన సొమ్ములో దాదాపు రూ.2కోట్ల వరకు కేటాయించారని పేర్కొన్నారు. నిధుల వినియోగంపై సమగ్ర విచారణ జరిపి అక్రమాలకు అడ్డుకట్ట వేసేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

శ్రీఆదివరాహస్వామి ఆలయ చైర్‌పర్సన్‌గా ప్రేమలత



కమాన్‌పూర్(మంథని): మండలకేంద్రంలోని శ్రీఆదివరాహస్వామి ఆలయ చైర్‌పర్సన్‌గా ఇనగంటి ప్రేమలత రెండోసారి నియామకమయ్యారు. ఆమెను మరో ఏడాదిపాటు చైర్మన్‌గా కొనసాగిస్తూ రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. డైరెక్టర్లుగా పిడుగు ఆంజనేయులు, దండె కనుకరత్నం, లక్ష్మి, చారి, జ్యోతి, రమేశ్ కొనసాగనున్నారు. తమ నియామకానికి సహకరించిన జెడ్పీ చైర్మన్ పుట్ట మధుకు పాలకవర్గ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కాంతరెడ్డి, అర్చకులు కలకుంట్ల వరప్రసాదాచార్యులు ఉన్నారు.

మిగిలింది మూడునెలలే..!



భూగర్భగనిలో బొగ్గు తీస్తున్న యంత్రం

- నిర్దేశిత లక్ష్యాలపై సింగరేణి దృష్టి
- వార్షిక లక్ష్యాల్లో 89శాతం ఉత్పత్తి
- జిల్లాలో రెండు ఏరియాలు ముందంజ

గోదావరిఖని: నిర్దేశిత లక్ష్యాల సాధనకు మరో మూడు నెలలే మిగిలింది. డిసెంబర్ వరకు 52.99మిలియన్ టన్నుల లక్ష్యం కాగా.. 47.22 మిలియన్ టన్నులు 89 శాతంలో నిలిచింది. మిగిలిన మూడు నెలల్లో 27 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించాల్సి ఉంది. సంస్థ వ్యాప్తంగా ఉన్న 11 ఏరియాల్లో ఇల్లెందు, మణుగూరు, ఆర్జీ-1, ఆర్జీ-2 నాలుగు ఏరియాలు మినహా మిగితా ఏరియాలు లక్ష్యాలకు దూరంలో ఉన్నాయి. రాబోయేది ఉత్పత్తి కాలం కావడంతో సంస్థ సీఎండీ శ్రీధర్, డైరెక్టర్లు బొగ్గు ఉత్పత్తి లక్ష్యాల సాధనపై దృష్టి సారించారు. ప్రధానంగా భారీగా బొగ్గు ఉత్పత్తి చేసే ఓసీపీలపై నజర్ పెట్టారు. నెలలో రెండుసార్లు ఉత్పత్తిపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎండీ సమీక్షిస్తుండగా.. డైరెక్టర్లు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. సింగరేణి వ్యాప్తంగా ఉన్న ఓసీపీలు ఉత్పత్తి లక్ష్యాల్లో దూసుకవెళ్తుండగా.. ఎక్కువ భూగర్భ గనులున్న ఏరియాలు ఉత్పత్తిలో వెనకబడ్డాయి. యాంత్రీకరణ గనులు మాత్రం ఉత్పత్తిలో దూసుకుపోతున్నాయి. రామగుండం రీజియన్‌లోని ఆర్జీ-1,2ఏరియాలు నిర్దేశిత లక్ష్యాలకు మించి బొగ్గు ఉత్పత్తి తీయగా ఆర్జీ-3, ఏపీఏ ఏరియా ఉత్పత్తిలో వెనకపడ్డాయి. ముఖ్యంగా రెండు ఏరియాల్లో జీడీకే-11, వకీల్‌పల్లిగని ఒక్కోగనిలో ఉన్న రెండు కంటిన్యూస్ మైనర్ యంత్రాలు ఉత్పత్తి లక్ష్యాల సాధనలో ముందంజలో ఉన్నాయి.

ఆర్థిక సంవత్సరంలో జిల్లాలోని ఏరియాల్లో సాధించిన బొగ్గు ఉత్పత్తి, లక్షల టన్నుల్లో

ఏరియా	టార్గెట్	సాధించింది	శాతం
ఆర్జీ-1	28.23	32.41	115
ఆర్జీ-2	62.54	63.18	101
ఆర్జీ-3	43.30	37.43	86
ఏపీఏ	15.94	11.03	69

అమెరికా వెళ్లనున్న అడవిశ్రీరాంపూర్ బృందం



బహుమతులు అందుకుంటున్న కళాకారులు

ముత్తారం: మండలంలోని అడవిశ్రీరాంపూర్‌కు చెందిన సాయి మారుతి కళామండలి బృందం అమెరికా వెళ్లనుంది. కొత్త సంవత్సరం సందర్భంగా హైదరాబాద్‌లోని కళాభారతిలో ఉత్తర అమెరికా తానా ఫౌండేషన్స్ ఆధ్వర్యంలో బహుజన మహోత్సవం నిర్వహించారు. ఇందులో అడవిశ్రీరాంపూర్‌కు చెందిన కళాబృందం యక్షగానంపై ప్రదర్శన ఇచ్చింది. అత్యంత ప్రతిభ కనబర్చినందుకు తానా ఫౌండేషన్ అధ్యక్షుడి చేతుల మీదుగా బహుమతి అందుకున్నారు. అనంతరం జూన్‌లో అమెరికాలో జరిగే మహోత్సవాలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. కేశనపల్లికి చెందిన దుర్గ మయూరి కళానిలయం ఆధ్వర్యంలో కోలాట బృందం ఈ మహోత్సవాల్లో పాల్గొని ప్రతిభ కనబర్చారు. ఈ బృందం కూడా అమెరికా వెళ్లనుంది. కళాకారులు కూనూరి సత్యనారాయణ గౌడ్, దుబాసి శ్రీనివాస్, మండల రమేశ్, గోస్కుల రమేశ్, తోడేటి శివకుమార్, అనవేన తిరుపతి, దేశిని తిరుపతి, పప్పు స్వరూప, కలవేన స్వరూప, కలవేన లత, కందుల లక్ష్మి, పప్పు శ్వేత, కలవేన సరోజన తదితరులు ఉన్నారు.

సీఎంను కలిసిన 'కోలేటి'



కేసీఆర్‌కు మొక్కను అందజేస్తున్న కోలేటి

గోదావరిఖని: సీఎం కేసీఆర్‌ను పోలీస్ హౌజింగ్ బోర్డు చైర్మన్ కోలేటి దామోదర్ సోమవారం ప్రత్యేకంగా కలిశారు. కేసీఆర్‌కు మొక్క అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

క్లుప్తంగా

ఎస్సారెస్పీ కాలువలోపడి వ్యక్తి మృతి

ఓదెల(పెద్దపల్లి): సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి గ్రామానికి చెందిన గంగుల లింగమూర్తి(51) మతిస్థిమితం సరిగా లేక జీలకుంట గ్రామ శివారులోని ఎస్సారెస్పీ కాలువలో ప్రమాదవశాత్తు పడి మృతిచెందాడు. పొత్కపల్లి ఎస్సై మహేందర్ కథనం.. లింగమూర్తికి మతిస్థిమితం సరిగా లేనందున గత నెల 31న ఇంటినుంచి బయటకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు ఎస్సారెస్పీ కాలువలో పడటంతో ఓదెల మండలం జీలకుంట, బీమరిపల్లె గ్రామాల మధ్యలో సోమవారం మృతదేహం లభించింది. మృతుడి భార్య మల్లేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ ఒకరు..

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం రాంపల్లి వద్ద గతనెల 30న బైక్ అదుపుతప్పి పడిపోయిన ఘటనలో గాయపడ్డ పనాస కిరణ్‌కుమార్ (34) హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. ఎస్సై సహదేవ్‌సింగ్ వివరాలు.. కాల్వశ్రీరాంపూర్ మండలం వెన్నంపల్లికి చెందిన కిరణ్‌కుమార్ వ్యవసాయపు పనులు చేసేవాడని పేర్కొన్నారు. మృతుడి తల్లి బుచ్చమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వివరించారు.

కుటుంబ కలహాలతో ఒకరి ఆత్మహత్య


నవీన్ (ఫైల్)

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): గోదావరిఖని ఎల్‌బీ నగర్‌కు చెందిన రాచర్ల నవీన్(30) గోదావరినదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. టూటౌన్ పోలీసుల వివరాలు.. నవీన్ గోదావరిఖనిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ల్యాబ్ టెక్నీషియన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. కొన్ని రోజుల నుంచి కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురై సోమవారం గోదావరి బ్రిడ్జి వద్దకు వెళ్లి నదిలో దూకాడు. గమనించిన రివర్ పోలీసులు పడవ సాయంతో వెలికితీసి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు పేర్కొన్నారు. మృతుడి తండ్రి రవి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ రెండో సీఐ అఫ్జలొద్దీన్ తెలిపారు. మృతుడికి భార్య, ఒక కూతురు ఉన్నారు.

విదేశాల్లో ఉన్నత విద్యపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న శ్రీనివాస్

పెద్దపల్లిరూరల్: విద్యార్థులు ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్లి ఎలాంటి కోర్సుల్లో చేరాలో అనే విషయమై కనీస అవగాహన అవసరమని తెలంగాణ యునైటెడ్ ఫోరం మాజీ అధ్యక్షుడు (యూఎస్‌ఏ) కల్వల విశ్వేశ్వర్‌రెడ్డి, కల్వల జనితారెడ్డి అన్నారు. స్థానిక గాయత్రీ డిగ్రీ, పీజీ కాలేజీలో సోమవారం విద్యార్థులతో సమావేశమై పలు సూచనలిచ్చారు. ఇంజినీరింగ్ విద్య కాకుండా డిగ్రీ తర్వాత చదువుల కోసం అమెరికా, ఆస్ట్రేలియా, లండన్, యుకే, కెనడా, జర్మనీ లాంటి దేశాల్లో పీజీ కోర్సుల్లో చేరవచ్చన్నారు. విదేశాల్లో చదువులు, ఉద్యోగావకాశాల కోసం తమ వంతుగా సహకారం అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో గాయత్రీ విద్యాసంస్థల అధినేత అల్లెంకి శ్రీనివాస్, సంపత్‌రావు, అతిక్, ప్రిన్సిపాల్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీలకు కొత్త సారథులు

- పోస్టుల భర్తీకి ఏడాదిగా ఎదురుచూపులు
- తాజాగా పేర్లు ఖరారు చేసిన అధికార పార్టీ
- వారం రోజుల్లో ఉత్తర్వులు వెలువడే అవకాశం


మంథని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం

మంథని: మంథని నియోజకవర్గంలో ఏడాదికి పైగా ఎదురుచూస్తున్న మూడు వ్యవసాయ మార్కెట్ కమిటీలకు నూతన పాలకవర్గం కొలువుదీరనుంది. నియోజకవర్గంలో తొమ్మిది మండలాలకు గాను మంథని, కాటారం, కమాన్‌పూర్ మార్కెట్ కమిటీలు ఉన్నాయి. మంథని పరిధిలో మంథనితో పాటు జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలం, అలాగే కాటారంలో మహాదేవపూర్, కాటారం, మహాముత్తారం, పలిమెల, కమాన్‌పూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీలో కమాన్‌పూర్, రామగిరి, ముత్తారం మండలాలు ఉన్నాయి.

కొత్తవారికే అవకాశం

కొత్తగా కొలువుదీరనున్న మూడు మార్కెట్ కమిటీలకు నూతన చైర్మన్లు రానున్నారు. మంథని మార్కెట్ కమిటీకి ఎక్కేటి అనంతరెడ్డి, కమాన్‌పూర్‌కు దాసరి రాజలింగు, కాటారానికి పెండ్యాల మమత పేరు దాదాపుగా ఖరారైనట్లు తెలిసింది. జెడ్పీ చైర్మన్ పుట్ట మధు ప్రతిపాదనల మేరకు పాలకవర్గాల పేర్లు పంపించగా, నాలుగు రోజుల క్రితమే ముఖ్యమంత్రితో పాటు సంబంధిత శాఖ మంత్రి ఆమోదం లభించినట్లు సమాచారం. వారం రోజుల్లో అధికారిక ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉందని ఆశావహులు పేర్కొంటున్నారు.


అనంతరెడ్డి


మమత


దాసరి రాజలింగు

ఏడాదిగా ఎదురుచూపులు

కమాన్‌పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పూదరి సత్యనారాయణ పనిచేశారు. ఇతడి పదవీకాలం 2021 అక్టోబర్‌లో పూర్తయింది. మంథని ఏఎంసీ చైర్మన్‌గా పనిచేసిన శ్రీరాంబట్ల సంతోషిణి పదవి 2022 ఏప్రిల్ 20న, కాటారం చైర్మన్‌గా పనిచేసిన ఆంకారి భవాని పదవీకాలం ఏడాది క్రితం పూర్తయింది. ఇలా సుమారు ఏడాది క్రితమే పాలకవర్గాల పదవీకాలం పూర్తి కాగా ఆరునెలలు పొడిగించారు. పొడిగించిన గడువు సైతం ముగిసింది. దీంతో నూతన పాలకవర్గం పదవుల కోసం ఆశావహులు ఎదురుచూస్తున్నారు. రాష్ట్రంలో రాజకీయ సమీకరణాలు, ఉప ఎన్నికలు ఇలా పలు కారణాలతో నామినేటెడ్ పోస్టుల భర్తీ ఆలస్యమైంది.

సీనియర్లకే అవకాశం

- మూడు మార్కెట్ కమిటీల్లోనూ సీనియర్లకే అవకాశం ఇచ్చినట్లు తెలుస్తోంది.
- మంథని మార్కెట్ కమిటీ పగ్గాలు చేపట్టబోయే ఎక్కేటి అనంతరెడ్డి 1981లో మంథని మండలం లక్కేపూర్ సర్పంచ్‌గా, నాలుగు పర్యాయాలు సింగిల్ విండో చైర్మన్‌గా పనిచేశారు.
- అలాగే టీఆర్‌ఎస్ పార్టీ ఆవిర్భావం నుంచి సేవలందిస్తున్నారు. కమాన్‌పూర్ ఏఎంసీకి ప్రతిపాదించిన దాసరి రాజలింగు ఉమ్మడి కమాన్‌పూర్ మండల వైస్‌ప్రెసిడెంట్, ఎంపీటీసీ, పార్టీ మండల అధ్యక్షుడిగా చాలాకాలంగా టీఆర్‌ఎస్‌లో పనిచేస్తున్నారు.
- కాటారం కమిటీ పగ్గాలు చేపట్టబోయే పెండ్యాల మమత గడిచిన జెడ్పీటీసీ ఎన్నికల్లో ఓటమి చవిచూడడంతో ఆమెకు మార్కెట్ కమిటీ పదవి అప్పగించి అక్కడి స్థానం పూరించనున్నారు.
- అంతేగాకుండా ఆయా సామాజిక వర్గాలు, రిజర్వేషన్ల ఆధారంగా మార్కెట్ కమిటీల్లో అవకాశం ఇచ్చినట్లు అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టి వ్యాను బోల్తా


గాయపడిన సతీష్


గాయపడిన రాము

రామగిరి(మంథని): మండలంలోని లద్నాపూర్‌లో మంథని– పెద్దపల్లి రహదారిపై సోమవారం రాత్రి ద్విచక్రవాహనాన్ని వ్యాను ఢీకొట్టి బోల్తా పడింది. స్థానికుల వివరాలు.. మంథని నుంచి బేగంపేట క్రాస్ రోడ్డు వైపు ద్విచక్రవాహనంపై మంథని మండలం సిద్దిపల్లికి చెందిన బండారి రాము, మంథనికి చెందిన వేల్పుల సతీష్ వస్తుండగా, వ్యాను వెనకనుంచి ఢీకొట్టి అదుపుతప్పి అక్కడే బోల్తా పడింది. ఈప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న రాము, సతీష్ తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు వారికి స్థానికంగా ప్రథమ చికిత్స చేయించి, 108లో పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రమాద స్థలాన్ని ఎస్సై రవిప్రసాద్ పరిశీలించారు. వ్యాను డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

విన్నపాలు.. వినవలె


ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ సంగీత

- 69 అర్జీలు అందుకున్న కలెక్టర్
- ప్రజావాణికి వినతుల వెల్లువ

పెద్దపల్లిరూరల్: 'డిగ్రీ పూర్తి చేసి జీవనాధారం కోసం ఆన్‌లైన్ సెంటర్ నడుపుతున్న. మీ సేవా కేంద్రాన్ని మంజూరు చేయండి..' అని హరీశ్ అనే యువకుడు కలెక్టర్‌కు విన్నవించుకున్నాడు.

'మేం నిరుపేదలం మాకు డబుల్‌బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేయించండి..' అంటూ పెద్దపల్లి పట్టణంలోని నల్లపోచమ్మ వాడకు చెందిన రఫియా సుల్తానా, అస్మా కలెక్టర్‌ను కోరారు. ఇలా జిల్లాలోని పలు మండలాలు, గ్రామాల నుంచి వచ్చిన వారంతా తమతమ సమస్యలపై ఇచ్చిన 69 దరఖాస్తులను కలెక్టర్ సంగీత స్వీకరించారు. 2023 నూతన సంవత్సరంలో జరిగిన తొలి ప్రజావాణి కార్యక్రమంలో అందిన 69 దరఖాస్తుల్లో 55 దరఖాస్తులు భూసంబంధమైన సమస్యలవే కావడం గమనార్హం. ప్రజల నుంచి అందిన ఫిర్యాదులను శాఖలవారీగా విభజించి సత్వరమే పరిష్కరించాలంటూ కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సమస్య పరిష్కరించలేనిపక్షంలో అందుకు గల కారణాలను ఫిర్యాదుదారుకు వివరించాలని పేర్కొన్నారు. ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు.

కేక్ కట్‌చేసిన అధికారులు

ప్రజావాణిలో పాల్గొనేందుకు వచ్చిన కలెక్టర్ సంగీత, అడిషనల్ కలెక్టర్లు లక్ష్మీ నారాయణ, కుమార్ దీపక్ కేక్ కట్ చేశారు. అన్ని శాఖల అధికారులు, సిబ్బందితో కలెక్టర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజావాణిలో ఫిర్యాదులందించేందుకు వచ్చిన వారందరికీ మిఠాయిలు అందించారు.

ఉద్యోగం ఇప్పించండమ్మా



కుటుంబ తగాదాలతో భర్తకు దూరంగా.. పాపతో కలిసి పుట్టింటి వద్ద ఉంటున్న. తల్లిదండ్రుల ఆర్థిక పరిస్థితి అంతంతే. డిప్లొమా చదువుకున్న. నేను, నా పాప బతకడం కోసం ఏదైనా చిన్న ఉద్యోగం ఇప్పించి ఆదుకోండి. – హిమబిందు, సుల్తానాబాద్

కోవిడ్ సాయం అందలే...



నా భర్త రెడ్డి సమ్మయ్య కోవిడ్ బారిన పడి మరణించాడు. ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయమూ అందలేదు. కుటుంబ పోషణ కష్టంగా ఉంది. కరోనా మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న పరిహారం తనకు వర్తింపజేసి ఆదుకోవాలి.
– రెడ్డి మధునమ్మ, ఓడేడ్, ముత్తారం మండలం

లక్ష్యాల సాధనలో నంబర్‌వన్‌గా నిలపాలి


మాట్లాడుతున్న జీఎం మనోహర్

- ఆర్జీ– 2 జీఎం మనోహర్

గోదావరిఖని(రామగుండం): వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్యాల సాధనలో ఆర్జీ–2 ఏరియాను సింగరేణిలోనే నంబర్ వన్‌గా నిలపాలని జీఎం ఎ.మనోహర్ కోరారు. సోమవారం జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గత డిసెంబర్‌లో 7.56లక్షల టన్నుల లక్ష్యానికి గాను 8.18 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించి లక్ష్యాలకు మించి 108శాతం ఉత్పత్తి సాధించామన్నారు. ఓసీపీ– 3 సీహెచ్‌పీ నుంచి 8.52 లక్షల టన్నుల బొగ్గు రవాణా చేశామని పేర్కొన్నారు. సమావేశంలో ఎస్‌ఓటూ జీఎం సలీం, ప్రాజెక్ట్ అధికారి జి.మోహన్‌రెడ్డి, అధికారులు జి.రాజేంద్రప్రసాద్, మురళీక్రిష్ణ, సృజన్‌మెహ్రా, డాక్టర్ మహిపాల్, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కార్మికవాడలకు శుభ్రమైన నీరు అందించాలి

- ఆర్జీ–1 జీఎం కె.నారాయణ


ఫిల్టర్‌బెడ్‌ను పరిశీలిస్తున్న జీఎం కె.నారాయణ

గోదావరిఖని(రామగుండం): కార్మిక వాడలకు శుభ్రమైన నీటిని అందించాలని ఆర్జీ–1 జీఎం కె.నారాయణ సంబంధిత అధికారులను ఆదేశించారు. కొద్దిరోజులుగా కార్మిక వాడలకు రంగుమారిన నీరు సరఫరా అవుతుండటంతో సోమవారం గంగానగర్ సమీపంలోని ఫిల్టర్‌బెడ్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా జీఎం మాట్లాడుతూ, మేడిగడ్డ బ్యారేజీ నిర్మించిన తర్వాత 24 గంటలు గోదావరినదిలో నీటి నిల్వ ఉండటం మూలంగా పారిశ్రామిక వ్యర్థాలు, పట్టణ ప్రాంత వ్యర్థాలు గోదావరినదిలో కలవడంతో నీరు రంగు మారుతోందన్నారు. దీనికి ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించి కొన్నేళ్లుగా నిరుపయోగంగా పవర్‌హౌజ్ పక్కన ఉన్న 1.5మిలియన్ గ్యాలన్ల సామర్థ్యం గల పాత ఫిల్టర్‌బెడ్‌కు మరమ్మతు చేసి 10 ఎంఎల్‌డీ నీటిని శుద్ధి చేసి కార్మికవాడలకు సరఫరా చేస్తున్నామన్నారు. అయినా గోదావరిలో రోజురోజుకు నీటి కాలుష్యం పెరిగిపోయి ఫిల్టర్ చేసినా ఉపయోగం లేకుండా పోతోందన్నారు. పరిష్కార మార్గాలు కనుగొనేందుకు అధికారులతో కలిసి ఫిల్టర్‌బెడ్ తనిఖీ చేశామని, నీటి శాంపిళ్లను ఎన్విరాన్ డిపార్ట్‌మెంట్ ద్వారా ఈపీటీఆర్‌ఐకి పంపించనున్నట్లు పేర్కొన్నారు. కాలనీల ప్రజలు సింగరేణి సరఫరా చేసే నీటిని కాచి చల్లార్చిన తర్వాతే తాగాలని సూచించారు. కార్యక్రమంలో సివిల్ డీజీఎం నవీన్, పర్సనల్ డీజీఎం లక్ష్మీనారాయణ, జీఎం కమిటీ సభ్యులు శేషగిరి, సివిల్ ఇంజినీర్ వెంకటేశ్వర్‌రావు తదతరులున్నారు.

కాంగ్రెస్ నాయకుల ముందస్తు అరెస్టు


పెద్దపల్లిరూరల్: పోలీస్‌స్టేషన్‌లో కాంగ్రెస్ నాయకులు


జూలపల్లి: అరెస్టయిన కాంగ్రెస్ నాయకులు

పోలీస్ స్టేషన్‌లకు తరలింపు

పెద్దపల్లిరూరల్/ఎలిగేడు/జూలపల్లి/కాల్వశ్రీరాంపూర్/ముత్తారం/కమాన్‌పూర్/రామగుండం/ధర్మారం/పాలకుర్తి/ఓదెల/రామగిరి: గ్రామ పంచాయతీల సర్పంచులకు మద్దతుగా హైదరాబాద్‌లో కాంగ్రెస్ తలపెట్టిన ధర్నాకు తరలివెళ్లకుండా మండలాలవారీగా పోలీసులు ముందస్తు అరెస్టులు చేశారు. పంచాయతీల నిధులను ఇతరపనులకు మళ్లించి సర్పంచుల నిధులు, విధులపై సీఎం కేసీఆర్ సర్కార్ అనుసరిస్తున్న తీరుపై పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో తలపెట్టిన కార్యక్రమాన్ని భగ్నం చేసేందుకు పోలీసులు అక్రమ అరెస్టులు చేశారని పార్టీ పెద్దపల్లి పట్టణ అధ్యక్షుడు సురేశ్‌గౌడ్, నియోజకవర్గ అధ్యక్షుడు చంద్రశేఖర్ అన్నారు. నాయకులు అవినాష్, ప్రణయ్‌కుమార్, సంపత్, సాగర్, తిరుపతి తదితరులు అరెస్టయ్యారు. ఎలిగేడు మండలంలో ఉపసర్పంచుల ఫోరం అధ్యక్షుడు కోరుకంటి వెంకటేశ్వర్‌రావు, సింగిల్‌విండో డైరెక్టర్ రమేశ్‌బాబు, జూలపల్లి మండలంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మానుమండ్ల శ్రీనివాస్, కొరెపు సంపత్, వెల్పుల లింగయ్య, కాల్వశ్రీరాంపూర్ మండలంలో అధ్యక్షుడు మునీర్, మత్స్యపారిశ్రామిక సంఘం అధ్యక్షుడు రాణవేన శ్రీనివాస్, ముత్తారం మండలంలో దాసరి చంద్రమౌళి, గాదం శ్రీనివాస్, కమాన్‌పూర్ మండలంలోని పలువురు నాయకులు, రామగుండంలో పట్టణ అధ్యక్షుడు ఈదునూరి హరిప్రసాద్, అప్పాసి శ్రీనివాస్, ధర్మారం మండలంలో అధ్యక్షుడు ఆవుల శ్రీనివాస్, బ్లాక్ 2 కాంగ్రెస్ ర్ధీ అధ్యక్షుడు కోమటిరెడ్డి రవీందర్‌రెడ్డి, బొల్లి స్వామి, పాలకుర్తి మండలంలో బామ్లానాయక్‌తండా, జీడీనగర్ సర్పంచ్‌లు బదావత్ రాజునాయక్, సూర సమ్మయ్య, మాజీ సర్పంచ్ పర్శవేని శ్రీనివాస్, ఓదెల మండలంలో రూపునారాయణపేట సర్పంచు అంకం రమేశ్, ఎంపీటీసీ రాగిడి రవీందర్‌రెడ్డి, రామగిరి మండలంలో తోట చంద్రయ్య, ఎంపీటీసీ కొప్పుల గణపతి, తదితరులను అరెస్ట్ చేశారు.

ప్రమాదరహిత సింగరేణిగా తీర్చిదిద్దుతాం



బ్యానర్ ప్రదర్శిస్తున్న జీఎంలు, తదితరులు

- జీఎంలు శ్రీనివాస్, వెంకటేశ్వరరావు

రామగిరి(మంథని): 2023 సంవత్సరంలో ప్రమాదరహిత సింగరేణిగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని ఏపీఏ జీఎం ఎన్వీకే శ్రీనివాస్, ఆర్జీ–3 జీఎం వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. సంస్థలోని అన్ని గనులు, విభాగాల్లో ఏర్పాటు చేసే రక్షణ బ్యానర్‌లను సోమవారం ప్రదర్శించి మాట్లాడారు. ప్రతీ ఉద్యోగి రక్షణ సూత్రాలను, ఎస్‌ఎంపీ(సేఫ్టీ మేనేజ్మెంట్ ప్లాన్)ని తూచ తప్పక పాటిస్తూ విధులు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో ఏరియా ఇంజినీర్ పి.ఎలీషా, ఎస్‌ఓటూ జీఎంలు డి.బైద్య, జి.రఘుపతి, ఏరియా రక్షణ అధికారి సిహెచ్.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

- తన చావుకు ముగ్గురు కారణమంటూ సూసైడ్ నోట్


రాజు (ఫైల్)

హుజూరాబాద్: హుజూరాబాద్ పట్టణం సాయిబాబా గుడి సమీపంలో అద్దె ఇంట్లో ఒంటరిగా ఉంటున్న జంగిలి రాజు (30) అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. ఆలస్యంగా వెలుగుచూసిన ఈ సంఘటనకు సంబంధించి కాలనీవాసులు, పోలీసుల కథనం ప్రకారం.. పట్టణానికే చెందిన జంగిలి రాజు స్థానిక సాయిబాబా గుడి సమీపంలో అద్దె ఇంట్లో ఉంటూ స్థానిక ఓ వైన్ షాపులో కూలీగా పనిచేస్తున్నాడు. కరోనా సమయంలో అతడి తల్లి మృతిచెందింది. అప్పటినుంచి ఒంటరిగానే ఉంటున్నాడు. రాజు ఉండే ఇంటి పరిసరాల నుంచి సోమవారం దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి ఇంటి తలుపులు తెరిచి చూడగా రాజు కుళ్లిపోయిన స్థితిలో శవమై కనిపించాడు. ఆయన చుట్టూ రక్తం ఉండడం.. శరీరం నుంచి ద్రవాలు వెలువడడంతో ముఖమంతా ఏర్పడకుండా మారిపోయింది. అతడి సెల్‌ఫోన్ సైతం స్విచ్ ఆఫ్ అయి ఉంది. బంధువులకు సమాచారం అందించగా.. వారం నుంచి అతడి సెల్ స్విచ్ ఆఫ్ అని వస్తోందని తెలిపారు. అయితే రాజు ఆత్మహత్యకు పాల్పడ్డాడా..? మరేదైనా కారణమా..? అనే విషయం విచారణ చేసిన తర్వాతే తెలిసే అవకాశం ఉందని పోలీసులు చెబుతున్నారు. గది లోపలి నుంచి తలుపులకు తాళం వేసి ఉండడంతో మనస్తాపంతోనే ఆత్మహత్య చేసుకున్నాడా..? అనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సూసైడ్ నోట్‌లో ముగ్గురి పేర్లు..

రాజు మృతదేహం వద్ద సూసైడ్ నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అందులో తన చావుకు చిన్నమ్మ అనసూర్య, శ్రీధర్, శివ కారణమని రాసి ఉంది. తన అమ్మ చనిపోయిన తర్వాత అక్క, బావ చేరదీశారని, అయితే అనసూర్య, ఆమె కొడుకులు తనను కొడుతున్నారని, వారివల్లనే జీవితంపై విరక్తి కలిగిందని, అందుకే ఇంజక్షన్ తీసుకుంటున్నానని రాసి ఉంది. తన చావుకు కారణమైన వారిపై చర్య తీసుకోవాలని కూడా ఆ ఉత్తరంలో కోరాడు.

ఉమక్క, రమేశ్‌బావ క్షమించండి..

'ఉమక్క నన్ను క్షమించు' అంటూ రాజు రాసిన లేఖ కంటతడి పెట్టించింది. 'ఉమక్క భయం వేస్తుంది. నాకు చావాలని లేదు. నన్ను జంగిలి అనసూర్య, శివ, శ్రీధర్ తిడుతూ కొడుతున్నారు. వాళ్ల వల్లే చని పోతున్నా. ఇంజక్షన్ వేసుకున్నాక ఎలా ఉంటుందో నాకు తెల్వది. ఆ ఇంజక్షన్ వేసుకున్న తర్వాత చస్తే నా బాడీ కుళ్లిపోయి వాసన వచ్చేవరకు ఎవరూ రా రేమో. బహుశా మీరు కూడా చూసే అవకాశం ఉండదేమో. ఎందుకంటే అంతగా నా బాడీ కుళ్లి పోయి ఉంటుంది. కనుక నన్ను క్షమించండి' అంటూ లే ఖలో పేర్కొన్నాడు. లేఖలోని విషయాలపైనా పో లీసులు లోతుగా విచారణ చేస్తున్నట్లు సమాచారం.

ఎస్‌ఎల్‌పీ పదోన్నతి పత్రాలు అందజేత


పదోన్నతి పత్రాలు అందజేస్తున్న జీఎం మనోహర్

గోదావరిఖని(రామగుండం): సర్వీస్ లింక్డ్ ప్రమోషన్ (ఎస్‌ఎల్‌పీ) పదోన్నతి పత్రాలను సోమవారం అందజేశారు. ఆర్జీ–2 జీఎం కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జీఎం ఎ.మనోహర్ 91మంది ఉద్యోగులకు పదోన్నతి పత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో యూనియన్ ఉపాధ్యక్షుడు ఐలి శ్రీనివాస్, ఎస్‌ఓటూ జీఎం అబ్దుల్‌సలీం, ధనుంజయ, రాజారెడ్డి, సురేష్‌బాబు, పీవీ రమణ, ధనలక్ష్మిబాయి, చంద్రమౌళి పాల్గొన్నారు.